క్లుప్తంగా

సీతారాములకు మంగళస్నానం



సీతారాముల ఉత్సవ విగ్రహాలకు మంగళస్నానం చేయిస్తున్న పండితులు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ సెక్టార్–6లోని వేంకటేశ్వర స్వామి, ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయంలో వసంత నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం కొనసాగాయి. శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం భక్తులు దంచిన పసుపుతో సీతారాములకు శాస్త్రోక్తంగా మంగళస్నానం చేయించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని వీక్షించారు. ఆదివారం సీతారాములను పెళ్లికూతురు, పెళ్లికొడుకుగా అలంకరించి కల్యాణం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కల్యాణ వేడుకకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో భక్తులు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సీతమ్మవారికి కుంకుమ పూజలు

మద్దిలపాలెం: జీవీఎంసీ 15వ వార్డు పాత వెంకోజీపాలెంలోని సీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా శుక్రవారం ఆలయ ప్రాంగణంలో మహా కుంకుమాభిషేకం జరిపారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని సీతమ్మ వారికి కుంకుమతో పూజ చేశారు. ఆలయ ప్రధానార్చకుడు రంపా రామ్మోహన్ శర్మ మహిళల గోత్ర నామాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ మళ్ల అప్పలరాజు, సంఘ అధ్యక్షుడు వెంకట సూర్య అప్పారావు, గౌరవ అధ్యక్షుడు మళ్ల పోలిరాజు, ప్రధాన కార్యదర్శి బొడ్డేటి రామకృష్ణ, కార్యదర్శి రవి, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

11 నుంచి పోలమాంబ ఉత్సవాలు



పండగ రాట వేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఆరిలోవ: జీవీఎంసీ తొమ్మిదో వార్డు సంజయ్ గాంధీ కాలనీలో పోలమాంబ అమ్మవారి పండగ సందర్భంగా పంచరాత్రి జాతర ఉత్సవాలకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానికులు పండగ రాట కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 11 నుంచి 15 వరకు ఉత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ అధ్యక్షుడు ఒమ్మి రాజు తెలిపారు. ప్రతి రోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేస్తామని చెప్పారు. ఈ నెల 15న ప్రధాన పండగ, పరస నిర్వహిస్తామన్నారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కంచుమూర్తి నాగరాజు, అతిథులు బుడుమూరు గోవిందరావు, కమిటీ సభ్యులు కంచుమూర్తి శ్రీను, బమ్మిడి మహేష్, కొంగలి కృష్ణ, సీర వినయ్, సంతోష్, మహిళలు పాల్గొన్నారు.

త్వరితగతిన కల్యాణ మండపం పనులు



కల్యాణ మండపం పనులపై ఆరా తీస్తున్న వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్

ఎంవీపీకాలనీ: ఎంవీపీ సెక్టార్–1లోని వీఎంఆర్‌డీఏ కల్యాణ మండపం పనులు త్వరితగతిన పూర్తిచేయాలని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ సూచించారు. కల్యాణ మండపంలో జరుగుతున్న పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సామాన్యులకు అందుబాటులో ఉండేలా కల్యాణ మండపాన్ని తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. దశాబ్దాలుగా నగర వాసులకు సేవలందిస్తున్న కల్యాణ మండపం శిథిలావస్థకు చేరుకున్న నేపథ్యంలో సకల సౌకర్యాలతో ఆధునికీకరిస్తున్నట్లు చెప్పారు. త్వరలోనే పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. కల్యాణ మండపంలో ఏసీ సౌకర్యం సైతం అంబాటులోకి తెచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ జాయింట్ కమిషనర్ కె.రమేష్, పలువురు ఇంజినీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.



పెదవాల్తేరులోని ప్రభుత్వ ఈఎన్‌టీ ఆస్పత్రి

మెరుగైన వైద్యం.. ప్రశ్నార్థకం..!

సొంత నర్సింగ్ సిబ్బంది లేని వైనం

ప్రాథమిక వైద్య పరీక్షలు మినహా.. మిగిలినవన్నీ బయట చేయించుకోవాల్సిందే

నర్సింగ్ విద్యార్థినులతో మందుల పంపిణీ

ఇబ్బందులు పడుతున్న రోగులు

ప్రభుత్వ ఈఎన్‌టీ ఆస్పత్రిలో డిప్యుటేషన్ నర్సులతోనే వైద్యం

బీచ్ రోడ్డు: అది ఒక పేరొందిన ప్రభుత్వ ఆస్పత్రి. ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాలకు ఉన్న ప్రత్యేకమైన ఈఎన్‌టీ వైద్యశాల. అటువంటి ఆస్పత్రికి కొన్నేళ్లుగా సొంత నర్సింగ్ సిబ్బంది అంటూ లేకుండానే ఉంది. దీంతో ఇతర ఆస్పత్రులపై ఆధార పడాల్సి వస్తోంది. పెదవాల్తేరులోని ప్రభుత్వ చెవి, ముక్కు, గొంతు(ఈఎన్‌టీ) ఆస్పత్రి దుస్థితి ఇది. ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఈఎన్‌టీ రోగాలతో బాధపడుతున్న పేదలకు ఈ ఆస్పత్రే ఆధారం. సర్జరీలకు అవసరమైన వైద్య పరీక్షలు చాలా వరకు ఇక్కడ అందుబాటులో లేవు. రోగులకు ముక్కులో వేసే డ్రాప్స్ కూడా కొన్ని లేవు. దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ నర్సింగ్ విద్యార్థినుల చేత రోగులకు మందులు పంపిణీ చేస్తున్నారు. అసలు ఇక్కడ రోగులకు మెరుగైన వైద్యం అందుతుందా అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

పూర్తిగా ఇతర ఆస్పత్రులపై ఆధారం

రోగులకు మెరుగైన వైద్యం అందించడంలో డాక్టర్ తర్వాత స్టాఫ్ నర్సులదే కీలక పాత్ర. అటువంటి స్టాఫ్ నర్సుల కోసం ఈఎన్‌టీ ఆస్పత్రి పూర్తిగా ఇతర హాస్పిటళ్లపై ఆధార పడుతోంది. ప్రస్తుతం ఈ ఆస్పత్రిలో 25 మంది స్టాఫ్ నర్సులు ఉండగా.. వారిలో పది మంది కేజీహెచ్‌కు చెందిన వారు కాగా.. మిగిలిన 15 మంది విమ్స్ ఆస్పత్రికి సంబంధించిన వారు. ఈఎన్‌టీ ఆస్పత్రిలో కేవలం నలుగురు హెడ్ నర్సులు మాత్రమే ఉన్నారు. వారిలో ఒకరు విమ్స్‌కు డిప్యుటేషన్‌పై వెళ్లారు. దీంతో ఇక్కడ డిప్యుటేషన్ నర్సులతోనే వైద్య సేవలు కొనసాగిస్తున్నారు.

కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ

ఈఎన్‌టీ ఆస్పత్రిలో వైద్యం నేర్చుకునేందుకు వచ్చిన నర్సింగ్ విద్యార్థులచే రోగులకు మందులు పంపిణీ చేయిస్తున్నారు. కనీసం వారిని పర్యవేక్షించడానికి ఒక ఫార్మసిస్ట్ కూడా మందులు ఇచ్చే గదిలో లేకపోవడం గమనార్హం. ఉన్నతాధికారులు దృష్టి సారించకపోవడం వల్ల ఆస్పత్రిలో నర్సింగ్ సిబ్బంది కొరత, వైద్య పరీక్షలు చేయకపోవడం వంటి సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు. పూర్తిగా వైద్యమే తెలియని నర్సింగ్ విద్యార్థినుల చేత మందులు పంపిణీ చేయడం ఎంతో ప్రమాదకరమని తెలిసినా.. ఆస్పత్రి ఉన్నతాధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై రోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈఎన్‌టీకి సంబంధించిన అన్ని వైద్య పరీక్షలు, స్కానింగ్‌లు ఈ ఆస్పత్రిలోనే జరగాలని, రెగ్యులర్ స్టాఫ్ నర్సులు అందుబాటులో ఉండాలని పేషెంట్లు, వారి కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

వైద్య పరీక్షలకు బయట ఆస్పత్రులకు వెళ్లాల్సిందే..

సర్జరీలకు అవసరమైన చాలా వైద్య పరీక్షలు ఈ ఆస్పత్రిలో జరగడం లేదు. ముఖ్యంగా పీఎన్ఎస్ స్కాన్, సిటీ స్కాన్ వైద్య పరీక్షలకు రోగులు బయటకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. రక్త పరీక్షల్లో ప్రాథమిక రక్త పరీక్షలు మినహా ఇతర రక్త పరీక్షలకు కూడా రోగులను బయట ఆస్పత్రికి పంపిస్తున్నారు. స్కానింగ్‌ల కోసం రోగులను కేజీహెచ్‌కు పంపితే అక్కడ స్కాన్ చేయడం కోసం రోజులు తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి. దీంతో సర్జరీలు చాలా ఆలస్యంగా జరుగుతున్నాయని రోగులు వాపోతున్నారు..





ఈఎన్‌టీ ఆస్పత్రిలో మందులు పంపిణీ చేస్తున్న నర్సింగ్ విద్యార్థినులు

నేత్రపర్వం.. నూకాంబిక మారువారం



పల్లకీలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

మద్దిలపాలెం: జీవీఎంసీ 15వ వార్డులోని సింహాద్రిపురం కొండవాలు ప్రాంతంలో కొలువైన నూకాంబిక అమ్మావారి మారువారం పండగ శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి ఆలయ అర్చకుడు వెంకటాచార్యులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో పురవీధుల్లో నేత్రపర్వంగా ఊరేగించి, అనంతరం జలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పెత్త ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

మార్కండేయులుకు సత్కారం



దేవరకొండ మార్కండేయులను సత్కరిస్తున్న ఫరూఖీ, మైనారిటీ సెల్ నాయకులు

ఎంవీపీకాలనీ: జిల్లా మైనారిటీ సెల్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి దేవరకొండ మార్కండేయులను ఘనంగా సత్కరించారు. విశాఖ జిల్లా ఎంప్లాయీస్, పెన్షనర్స్ విభాగం అధ్యక్షుడిగా ఇటీవల మార్కండేయులను నియమించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా శుక్రవారం వైఎస్సార్‌సీపీ జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఐహెచ్ ఫరూఖీ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సత్కరించి, అభినందించారు. ఉద్యోగులు, పెన్షనర్ల సంక్షేమానికి విలువైన సేవలందించాలని, వైఎస్సార్‌సీపీ బలోపేతానికి మరింత కృషి చేయాలని మార్కండేయులకు ఫరూఖీ సూచించారు. కార్యక్రమంలో పలువురు మైనారిటీ సెల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆటిజంపై అవగాహన అవసరం



ఆటిజం అవగాహన కార్యక్రమంలో వైద్యులు

ఆరిలోవ: పిల్లల్లో పెరుగుతున్న ఆటిజం సమస్య గురించి తల్లిదండ్రులకు అవగాహన ఉండాలని రెయింబో చిల్డ్రన్ ఆస్పత్రి వైద్యులు అన్నారు. ప్రపంచ ఆటిజం అవేర్‌నెస్ వీక్‌లో భాగంగా శుక్రవారం హెల్త్ సిటీలోని రెయింబో చిల్డ్రన్ ఆస్పత్రిలో పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆటిజం రుగ్మత, ఈ సమస్య వల్ల పిల్లల్లో కలిగే ఇబ్బందులు, నష్టాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. పీడియాట్రిక్ న్యూరాలజిస్ట్ డాక్టర్ అశ్విన్ మోహన్, కన్సల్టెంట్ సైకియాట్రిక్స్ డాక్టర్ ప్రసన్న కుమార్, సైకాలజిస్ట్ డాక్టర్ దీపామోహన్, స్పీచ్ థెరపిస్ట్ డాక్టర్ లక్ష్మి, ఆక్యుపేషనల్ థెరపిస్ట్ డాక్టర్ దివ్య విలేకరులతో మాట్లాడుతూ కొంత కాలంగా ఆటిజం సమస్య పిల్లల్లో పెరుగుతోందన్నారు. దీని వల్ల చిన్నారులు సరిగా మాట్లాడలేకపోవడం, ఎదుగుదలలో లోపం, వస్తువులు గుర్తించలేకపోవడం, ఎక్కువ విషయాలపై దృష్టి పెట్టకపోవడం జరుగుతాయన్నారు. మన దేశంలో ప్రతి 68 మంది పిల్లల్లో ఒకరు ఆటిజం సమస్యతో బాధపడుతున్నట్లు సర్వేల్లో వెల్లడైందని తెలిపారు. ఆటిజం లక్షణాలున్న పిల్లల తల్లిదండ్రులు వైద్యులను సంప్రదించాలని సూచించారు. రెండేళ్ల లోపే ఈ సమస్యను గుర్తించగలిగితే వేగంగా దాని నుంచి బయటపడవచ్చన్నారు. ఈ సమస్య ఉన్న పిల్లలకు ఆక్యుపేషనల్ థెరఫీ, బిహేవియరల్ థెరఫీ, స్పీచ్ థెరపీ అవసరమని వైద్యులు పేర్కొన్నారు.

'స్మార్ట్ మీటర్లు మా ఇంటికి పెట్టొద్దు'



స్మార్ట్ మీటర్ల స్టిక్కర్లు ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకుడు కుమార్, స్థానికులు

ఆరిలోవ: ప్రజలపై విద్యుత్ భారాలు మోపే స్మార్ట్ మీటర్లను అందరూ వ్యతిరేకించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్.కె.ఎస్.వి.కుమార్ పిలుపునిచ్చారు. 12వ వార్డు సుందరయ్య కాలనీలో గ్రామ సంఘ సభ్యులతో కలసి శుక్రవారం 'స్మార్ట్ మీటర్లు మా ఇంటికి పెట్టొద్దు' అని ముద్రించిన స్టిక్కర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో మోదీ ప్రభుత్వం విద్యుత్‌ను ప్రైవేటీకరించడానికి పూనుకొందన్నారు. విద్యుత్‌పై రాష్ట్రాలకు ఉండే హక్కులను పూర్తిగా కాలరాయడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఇప్పటికే అదనంగా వేస్తున్న సర్దుబాటు చార్జీలు, ట్రూ అప్ చార్జీతో ప్రజలపై ఆర్థిక భారం పడిందన్నారు. ఇప్పుడు ఇళ్లకు స్మార్ట్ మీటర్లు అమర్చడం వల్ల ఎక్కువ కరెంట్ బిల్లులు వచ్చి ప్రజలపై మరింత ఆర్థిక భారం పడుతుందని చెప్పారు. ఈ మీటర్లను అందరూ వ్యతిరేకించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నరేంద్రకుమార్, కాలనీ సంఘ సభ్యులు అప్పలనాయుడు, రాజు, రమణ, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నేచర్ క్యాంప్



కంబాలకొండలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న పలు పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఆరిలోవ: జాతీయ రహదారి పక్కన కంబాలకొండ ఎకో టూరిజం పార్కులో శుక్రవారం తోటగరువు, చంద్రపాలెం, ఎండాడ, గోపాలపట్నం, సునీల్‌శర్మ కాలనీల పాఠశాలలతోపాటు పలు ప్రైవేట్ స్కూళ్ల విద్యార్థులకు ఉపాధ్యాయులు నేచర్ క్యాంప్ నిర్వహించారు. విద్యార్థులు ఇక్కడ వివిధ వృక్షాలు, ఔషధ మొక్కలు, కొండలు తదితర వాటిని పరిశీలించారు. వాటి గురించి ఉపాధ్యాయులు వివరించారు. పర్యావరణంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్‌జీసీ కో ఆర్డినేటర్ రెడ్డి బాబూరావు మాట్లాడుతూ కంబాలకొండలో వివిధ రకాల మొక్కలు, వన్యప్రాణుల గురించి విద్యార్థులు వివరించారు. పర్యావరణంలో వాటి ఆవశ్యకత తెలియజేశారు. అనంతరం ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్‌లో భాగంగా ముద్రించిన పోస్టర్‌ను విద్యార్థులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి కప్పల ప్రసాద్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు గొట్టేటి రవి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి మత్తులో యువకుడి హల్‌చల్

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతం డ్రైవర్స్ కాలనీలో ఓ యువకుడు గంజాయి మత్తులో శుక్రవారం హల్‌చల్ చేశాడు. డ్రైవర్స్ కాలనీ నుంచి ముస్తఫా కాలనీ వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ వ్యక్తి హారన్ కొట్టాడు. ఆ శబ్దం విన్న గంజాయి మత్తులో ఉన్న యువకుడు ద్విచక్ర వాహన చోదకుడిపై గట్టిగా అరిచాడు. దీంతో వారిద్దరి మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది. ఇంతలో స్థానికులు అక్కడికి చేరుకొని గంజాయి యువకుడిపై తిరగబడ్డారు. దీంతో ఆ యువకుడు చిన్న చాక్‌తో తన మెడపై తానే స్వల్పంగా కోసుకొని పోలీస్ స్టేషన్‌కు వెళ్లాడు. స్థానికులంతా కలసి తనపై దాడిచేసి హత్యచేయడానికి ప్రయత్నించారని పోలీసులకు తెలిపాడు. గంజాయి కేసులో పలుసార్లు పట్టుబడిన ఆ యువకుడి గురించి తెలిసిన పోలీసులు మందలించి పంపించేశారు. ఇదిలా ఉండగా.. సాయంత్రం ఆ ప్రాంతంలో బీట్ రౌండ్స్ నిర్వహించడానికి వెళ్లిన ఆరిలోవ పోలీసులను స్థానికులు చుట్టుముట్టారు. పోలీసుల నిఘా లేకపోవడం వల్లే గంజాయి బ్యాచ్‌లు ఇష్టమొచ్చినట్లు చెలరేగిపోతున్నాయని నిలదీశారు. గంజాయి మూకల వల్ల రోడ్లపై తిరగలేకపోతున్నామని, విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లి తిరిగి ఇంటికి చేరేటప్పుడు భయపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గంజాయి బ్యాచ్‌లపై పోలీస్ అధికారులకు, స్థానిక ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేస్తామని స్థానికులు తెలిపారు.

సంప్రదాయాలను కాపాడుకోవాలి



మాట్లాడుతున్న ఏయూ వీసీ రాజశేఖర్

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ సిస్టం ఇంజినీరింగ్ విభాగంలో శుక్రవారం ఎత్నిక్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ అభినందించారు. మన సంస్కృతీ, సంప్రదాయాలను కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రజలందరిని ఐక్యం చేయడానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. విద్యార్థులకు స్వయంగా వైస్ ఛాన్సలర్ కవిత చదివి వినిపించారు. అనంతరం విభాగ విద్యార్థులు పరిశోధకులతో ఆయన ముచ్చటించారు. పరిశోధకులు తాము చేస్తున్న పరిశోధనలను వీసీ వివరించారు. విద్యార్థులతో మాట్లాడుతూ వారు ఇంటర్న్‌షిప్ చేస్తున్న విధానం, అంశాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణరావు, విభాగాధిపతి ఆచార్య కె.వెంకట రావు, ఆచార్య శశి, ఆచార్య లావణ్యదేవి, ఆచార్య వల్లికుమారి, విభాగాచార్యులు, పరిశోధకులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్తమ లక్ష్యాలతో ఉన్నత శిఖరాలు



మోటివేషనల్ స్పీకర్ వేణుగోపాల్‌ను సత్కరిస్తున్న ఆచార్యులు

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీ గణిత శాస్త్ర విభాగంలోని సీనియర్ విద్యార్థులకు ఫేర్‌వెల్ డే వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ మోటివేషనల్ స్పీకర్ లక్ష్మీపురం వేణుగోపాల్ మాట్లాడుతూ జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి ఏ రకంగా లక్ష్యాలు ఏర్పాటు చేసుకోవాలో ఉదాహరణలతో వివరించారు. మీ జీవితం.. మీ చేతుల్లోనూ ఉందని, దానిని అందంగా మలుచుకునే శిల్పి మీరేనని విద్యార్థులకు సూచించారు. ముఖ్య అతిథి కాలేజీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.వి.ఆర్.రాజు మాట్లాడుతూ జీవితంలో ఉపయోగపడే పాజిటివ్ యాటిట్యూడ్, నిబద్ధత, సమయపాలన అలవాటు చేసుకోవాలన్నారు. గణిత శాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ అనురాధ కామేశ్వరి మాట్లాడుతూ విద్యార్థులతో తన అనుభవాలను పంచుకున్నారు. సభ అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రొఫెసర్ పి.డి.ఎస్.శ్రీనివాస్, ప్రొఫెసర్ జి.నానాజీరావు, ప్రొఫెసర్ ఎస్.రవికుమార్, ప్రొఫెసర్ సిహెచ్.శ్రీనివాసరావు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మరింత మెరుగ్గా పోలీస్ భద్రతా ప్రమాణాలు

- విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జట్టి
- ఏఆర్ పోలీస్ కార్యాలయంలో వార్షిక తనిఖీలు



సలాం చేస్తున్న జాగిలానికి నమస్కరిస్తున్న డీఐజీ గోపినాథ్



ఆయుధాలు పరిశీలిస్తున్న డీఐజీ గోపినాథ్ జట్టి

ఆరిలోవ: విశాలాక్షినగర్ ప్రాంతం కైలాసగిరి జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ కార్యాలయంలో శుక్రవారం విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జట్టి వార్షిక తనిఖీలు నిర్వహించారు. అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆధ్వర్యంలో పరేడ్ నిర్వహించారు. పోలీస్ జాగిలాలు డీఐజీకి సలాం చేశాయి. ఈ సందర్భంగా డీఐజీ పోలీసుల ఆయుధాలు, మోటార్ ట్రాన్స్‌పోర్ట్ విభాగం, డాగ్ స్క్వాడ్ తనిఖీ చేశారు. సెక్యూరిటీ వెల్ఫేర్ విభాగం రికార్డులు పరిశీలించారు. ఇక్కడ నార్కోటిక్ జాగిలం బన్నీకి మత్తు పదార్థాలు కనిపెట్టినందుకు ఆయన రివార్డ్ ప్రకటించారు. వాహనాల నిర్వహణ, ఆయుధాల పనితీరు, శిక్షణ ప్రమాణాలు, భద్రతా ఏర్పాట్ల గురించి ఎస్పీ తుహిన్ సిన్హాను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ పోలీస్ భద్రతా ప్రమాణాలను మరింత మెరుగుపరచాల్సిన అవసరముందన్నారు. దీనికి సంబంధించి పోలీసులకు పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.దేవప్రసాద్, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణారావు, మన్మథరావు, రమణమూర్తి, సంజీవిరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కరకచెట్టు పోలమాంబ రాటోత్సవం

మే 6 వరకు జాతర ఉత్సవాలు



రాటోత్సవంలో దేవస్థానం సభ్యులు, భక్తులు

బీచ్‌రోడ్డు: పెద్దవాల్తేరులోని కరకచెట్టు పోలమాంబ అమ్మవారి వార్షిక జాతర మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం పందిరి రాట ఉత్సవం ఘనంగా జరిగింది. ముందుగా రాటతో దేవస్థానం చుట్టూ మూడుసార్లు ప్రదక్షిణ చేశారు. వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ రాట వేశారు. ఈ సందర్భంగా దేవదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ అన్నపూర్ణ, ఆలయ ఈవో కె.గాయత్రి మాట్లాడుతూ పోలమాంబ జాతర ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. శుక్రవారం నుంచి మే 6 వరకు వార్షిక జాతర జరుగుతుందన్నారు. ఈ నెల 6న పండగ చాటింపు, 7న దేవర పండగ(పుట్టబంగారం), 14న తొలేళ్లు, 15న అనుపు ఉత్సవం, 22న మారువారం, 26న మహా అన్నదానం నిర్వహిస్తామని వెల్లడించారు. ఆలయాన్ని సుందరంగా అలంకరిస్తున్నామని, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని, ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామని, ఎండల దృష్ట్యా తాగునీరు, మజ్జిగ వంటివి పంపిణీ చేస్తామన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానికుల సహకారంతో ఉత్సవాలు జయప్రదం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 14న సోమవారం రాత్రి 10 గంటల నుంచి 14 గ్రామాల ఆరాధ్య దైవం పోలమాంబకు తొలి పూజ జరుగుతుందని, పాల్గొనే భక్తులు దేవస్థానంలో రూ.2 వేల చెల్లించాలని చెప్పారు. అనంతరం ఉత్సవాల కరపత్రం ఆవిష్కరించారు. కార్యక్రమంలో దేవస్థాన అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

వైవిధ్యాన్ని ఏకం చేసేది ప్రజాస్వామ్యం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ శీతల్ శర్మ

విశాఖ విద్య: వైవిధ్యాన్ని ఏకం చేసేది ప్రజాస్వామ్యమని జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీ న్యూఢిల్లీ సెంటర్ ఫర్ యూరోపియన్ స్టడీస్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శీతల్ శర్మ అన్నారు. ఏయూ పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ యూరోపియన్ యూనియన్ సహకారంతో ఇన్స్టిట్యూట్ ఫర్ డెమోక్రటిక్ ఎంగేజ్‌మెంట్ అండ్ అకౌంట్ సమన్వయంతో భారత్–యూరప్ దేశాల్లో ప్రజాస్వామ్యం వైవిధ్యత మార్పులు అనే అంశంపై శుక్రవారం నిర్వహించిన అంతర్జాతీయ సదస్సును ఆమె ప్రారంభించి మాట్లాడారు. సాధికారత మన చేతుల్లోనే ఉంటుందనే విషయాన్ని గుర్తించాలన్నారు. కేయూ పొలిటికల్ సైన్స్ విభాగ విశ్రాంత ఆచార్యుడు కె.రవి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాల్లో ప్రజాస్వామ్యం అమలు కావడం లేదని, కేవలం మూడో వంతు దేశాల్లో మాత్రమే ఉన్నట్లు చెప్పారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వ వీసీ ఆచార్య ఎ.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ భారతదేశం ఎంతో సుందరంగా ఉంటుందని, ఇది ఒక పెద్ద ప్రజాస్వామిక దేశమని చెప్పిన సందర్భాన్ని వివరించారు. సదస్సు కన్వీనర్ ఆచార్య పేటేటి ప్రేమానందం మాట్లాడుతూ సదస్సు ముఖ్య ఉద్దేశం, ప్రాధాన్యాన్ని వివరించారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, రీజనల్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ టి.అనిల్‌కుమార్, సదస్సు కో కన్వీనర్ డాక్టర్ షేక్ సులేమాన్, డాక్టర్ టి.నాగరాజు, డాక్టర్ కె.సత్యనారాయణ తదితరులు ప్రసంగించారు. సదస్సు ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు.